

సాక్షి
గుంటూరు
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 8,430 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 35,450 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 34,397 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 43.4506 టీఎంసీల నిల్వ ఉంది.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 589.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 81,831 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

అన్నదాతకు అండగా పోరు బాట

కూటమి సర్కార్ కళ్లు తెరిపించేలా వైఎస్సార్‌సీపీ సన్నాహాలు

ఆరుగాలం శ్రమించే రైతులకు కూటమి పాలనలో అడుగడుగునా ఘోష తప్పడం లేదు. సాగునీరు మొదలు విత్తనం, ఎరువులు, గిట్టుబాటు ధరల వరకు కన్నీరే మిగులుతోంది. పాలకుల నిర్లక్ష్యంతో కష్టాల్లో కూరుకుపోతున్నారు. అన్నదాతల తరఫున కూటమి సర్కార్ వైఫల్యాలను నిలదీయడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఈ నెల 9వ తేదీన 'అన్నదాత పోరు' చేపట్టనుంది. జిల్లాల్లోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, వినతిపత్రాల సమర్పణతో కూటమి పాలకుల కళ్లు తెరిపించి రైతులను ఆదుకునేలా పోరుబాట పట్టనుంది. ఈ మేరకు నియోజకవర్గాల్లో సమీక్షా సమావేశాలు, పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు శనివారం జరిగాయి.

దళారులు, టీడీపీ నేతల చేతుల్లోకి ఎరువులు

- యూరియా కోసం రైతులు కొట్టుకోవాల్సిన దుస్థితి
- అన్నదాతల పక్షాన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ పోరు
- 9న జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు , పార్టీ నేతలు

నగరంపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన, అనంతరం వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గాల సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి), అన్నాబత్తుని శివకుమార్ (తెనాలి), వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు)(తాడికొండ), అంబటి మురళీకృష్ణ (పొన్నూరు), పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఉడుముల పిచ్చిరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ సైదాఖాన్, గులాం రసూల్‌లతో కలిసి 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని గుంటూరు, తెనాలి ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శన, వినతి పత్రాలు అందిస్తామని చెప్పారు. ఏపీలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపించారు. కొరతపై దుష్ప్రచారం చేసే వారిపై కేసులు బనాయిస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించడం దుర్మార్గం అని విమర్శించారు. రాష్ట్రంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఎరువుల కొరత లేకపోతే విజయనగరం జిల్లాలోని ఓ ప్రైవేటు దుకాణం వద్ద లైనుల్లో ఉన్న రైతులు యూరియా కోసం ఎందుకు కొట్టుకున్నారని అంబటి గుర్తుచేశారు. రైతులు ఎరువుల కోసం అల్లాడిపోతున్న వైనంపై సోషల్ మీడియాతోపాటు చంద్రబాబు అనుకూలమైన ఎల్లో మీడియాలో రాస్తున్నారని గుర్తుచేశారు. వరుస లైన్లల్లో రైతులు ఉన్న ఫొటోలను ఓ పత్రిక లోపలి పేజీలో ఇచ్చిందని తెలిపారు.

దారుణంగా విఫలమైన ప్రభుత్వం

సకాలంలో రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యూరియా ఇప్పటికే దళారులు, టీడీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసుని కూడా ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో జరిగిన మరణాలపై వైఎస్సార్‌సీపీ కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వల్లే స్పందన వచ్చిందని అన్నారు. అసెంబ్లీకి వెళ్లకపోయినా ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రైతుల పక్షాన చేపట్టిన 'అన్నదాత పోరు'లో రైతులు భారీగా పాల్గొనాలని అంబటి పిలుపునిచ్చారు.

రైతులను ఆదుకోవడంలో సర్కార్ విఫలం

- అన్నదాతలను పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- తెనాలిలో 9న నిర్వహించనున్న 'అన్నదాత పోరు'పై సమీక్ష
- పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలిరావాలని పిలుపు



'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ, నాయకులు

పొన్నూరు: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. యూరియా అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 9వ తేదీన తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహణపై పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోస్టర్‌ను నాయకులతో కలిసి మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొన్నూరు నియోజకవర్గంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల కనీసం రైతులను పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదన్నారు. రైతు సంక్షేమాన్ని విస్మరించి సంగం డెయిరీ ఉత్పత్తులను విక్రయించుకునే పనిలో ఎమ్మెల్యే నిమగ్నమయ్యారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతులను వెన్నుపోటు పొడిచి యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ ఇబ్బంది పెడుతోందని అన్నారు. వెంటనే రైతులకు రూ. 10 వేలు నష్టపరిహారం, ఉచితంగా ఎరువులు, పురుగు మందులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెనాలి రండి

రైతు సమస్యల పరిష్కారం కోసం 9న తెనాలి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పొన్నూరు అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ భవనం పద్మలీల, వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల వెంకటేశ్వరరావు, పొన్నూరు, పెదకాకాని మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, మల్లికార్జునరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మరియారాణి, నాయకులు లంకపోతు పిచ్చిరెడ్డి, షేక్ నాజర్, అంబటి వెంకటేశ్వరరావు, బోయిన నాగరాజు, గేరా సంజీవ్, దేవరకొండ గోపి, ఆర్. ఆదిశేషు, భీమవరపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులను అవమానించేలా సర్కార్ వైఖరి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- యూరియా, ఎరువుల పంపిణీలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఎరువులకు బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధర పెడుతున్న రైతులు
- 9న 'అన్నదాత పోరు'కు పార్టీ శ్రేణులు, రైతులు తరలిరావాలని పిలుపు

ఫిరంగిపురం: రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ నిలుస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు, రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వనమా బాల వజ్రబాబు మాట్లాడుతూ... యూరియా, ఎరువుల కోసం రైతులు కొన్ని నెలలుగా ఎన్నో ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని తెలిపారు. రైతుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్డీవోకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఎరువుల కోసం రైతులు బారులుతీరాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మద్దతు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతులను ఆదుకోవాల్సిన కూటమి నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన నిలిచి వైఎస్సార్‌సీపీ పనిచేస్తుందన్నారు. పార్టీ రైతు విభాగం నాయకులు ఎం. రాఘవరెడ్డి, కె. రామారావు, నాయకులు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె.చిన్నప్పరెడ్డి, దాసరి సురేష్, చిట్టా అంజిరెడ్డి, దాసరి మెల్కియా, ఎస్ చిన్నప్ప, పెరికల చిన్న, కె.ప్రవీణ్‌రెడ్డి, వై.హేమలతారెడ్డి, చేవూరిరామమోహన్‌రెడ్డి, షేక్.మస్తాన్‌వలి, కె.బ్రహ్మారెడ్డి, బి. అంజిరెడ్డి, టి.కృష్ణ, జుబేర్, ఎం.రాయప్ప, జె.ఆనంద్, ఇజ్రాయిల్, పిచ్చిరెడ్డి, ప్రతాప్‌దేవ్, కె.రాజు, పి.శ్రీనివాసరెడ్డి, ఎస్.సైదులు, బాలిరెడ్డి, సాల్మన్, డి.బాబురావు, డి.నరేంద్రకుమార్, కె.శ్రీనివాసరెడ్డి, చిన్నసుబాని, రాంబాబు, ఎం.గోపి, రోశయ్య, మోరంరెడ్డి, డి.శ్రీను, వెంకట్, పి.శ్రీనివాసరెడ్డి, వెంకట్, రవి. వెంకట్రావులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వనమా బాలవజ్రబాబు, నాయకులు

మొక్కల పేరిట మళ్లీ కక్కుర్తి!

- నగరంలోని డివైడర్ల మధ్య మట్టి నింపి నాటేందుకు ఏర్పాట్లు
- ఇటీవల సీఎం పర్యటన సమయంలో రూ.30 లక్షల వరకు ఖర్చు
- ఇప్పుడు మరో 45 వేల మొక్కలు తీసుకొచ్చిన అధికారులు
- మట్టి నింపడం, మొక్కలు నాటేందుకు ఏకంగా రూ.కోటి వ్యయం
- టెండర్ పిలవకుండా పనులు అప్పగించడంపై పలు విమర్శలు

కూటమి వచ్చాక ప్రజాధనం అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నారు. దొరికినంత దోచుకునేందుకు పచ్చనేతలు, ఆ ముసుగులోని కాంట్రాక్టర్లు కలిసి ప్రభుత్వ సొమ్ము ఫలహారంలా ఆరగించేస్తున్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొక్కల పెంపకం పేరిట రూ.కోటి వరకు ఖర్చు చేశారు. పైగా టెండర్లు పిలవకుండా అయినవారికి పనులు కట్టబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ ఐలాండ్‌లో మట్టిని తొలగించిన దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మొక్కలనే అధికారులు సంరక్షించడం లేదు. పైగా కొత్తగా కొన్ని వేల మొక్కలను తెప్పించారు. వాటి సంరక్షణ సంగతి కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వీటికోసం డివైడర్లలో కొత్తగా మట్టిని నింపుతున్నారు. ఈ రెండు పనులు చేసినందుకు సుమారు రూ.కోటి వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

టెండర్ ప్రక్రియ లేకుండానే?

టెండర్లు వేయకుండానే నకిలీ పత్రాలు పెట్టి కొందరు టెండర్లు దక్కించుకున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మొక్కలు తీసుకొచ్చేందుకు కూడా టెండర్ పిలవలేదని సమాచారం. నామినేషన్ పద్ధతిలో మొక్కలు, మట్టిని తెప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీటిని నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో దించారు. మట్టిని మాత్రం రోడ్లపై పోసి గతంలో ఉన్న పాత మట్టిని తొలగించి కొత్తగా నింపుతున్నారు.



లారీల్లో తెచ్చిన మొక్కలు

టీడీపీ కార్పొరేటర్లే వద్దన్నా..

గతంలో ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం రూ.30 లక్షలకుపైగా వెచ్చించి గుంటూరుకు మొక్కలు తీసుకొచ్చారు. అవి పాడైపోవడంతో సోషల్ మీడియాలో దుమారం రేగింది. అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. మళ్లీ మొక్కలు తెప్పించే అంశంపై టీడీపీకి చెందిన కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. ఉన్న మొక్కలను సంరక్షించకుండా కొత్తవి ఎందుకని అధికారులను పలు సందర్భాల్లో ప్రశ్నించారు. వారి తీరు మాత్రం మారలేదు. మొక్కలను తెప్పించారు. డివైడర్లలో ఉన్న మొక్కలు చాలా ప్రాంతాల్లో ఎండిపోయాయి. వీటి సంరక్షణను పట్టించుకోవడం లేదు. దీంతో ఎండిపోతున్నాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మరణాలు

- గ్రామంలో బెల్ట్ దుకాణాల ద్వారా ఏరులై పారుతున్న మద్యం
- అత్యంత అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
- కలుషిత తాగునీటితో ప్రజలకు అనారోగ్య సమస్యలు
- బాధిత కుటుంబాలకు అండగా వైఎస్సార్‌సీపీ



బాధితులను పరామర్శిస్తున్న బలసాని

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో పలువురు కేవలం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మృతి చెందారని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతులకు నివాళులు అర్పించారు. ప్రతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకూ పోరాడదామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ... గ్రామంలో తాగునీరు ప్రజలకు అందటం లేదన్నారు. కానీ మద్యం మాత్రం ఏరులై పారుతోందన్నారు. చిన్నపాటి గ్రామంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగు బెల్ట్ షాపులు వెలిశాయని పేర్కొన్నారు. ఇంటి దగ్గరే మద్యం దొరుకుతుండటంతో అందరూ వాటికి అలవాటు అవుతారన్నారు.

మెరుగైన వైద్యసేవలు కీలకం

కలుషిత తాగునీరు, పారిశుద్ధ్యం లోపం, అక్రమ మద్యం విక్రయ దుకాణాలు వంటి వాటి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ అధికారులు దీనికి బాధ్యత వహించాలన్నారు. ప్రతి ఇంటిని మినరల్ వాటర్‌ను అందించాలన్నారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి వెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. ప్రతి రోజు పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, మండల కన్వీనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, పిల్లి మేరి, పెద్దిరెడ్డి సామ్రాజ్యం, మెట్టు వెంకటప్పారెడ్డి, దారం అశోక్‌కుమార్, వెంకటరావు, గ్రామంలోని ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్, జీపీఎస్ రద్దు బిల్లును పెట్టాలి

గుంటూరు వెస్ట్: ఈ నెల 11వ తేదీన జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్, జీపీఎస్ రద్దు బిల్లును ప్రవేశపెట్టాలని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ బాషా కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఉద్యోగ సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకుని ఉద్యోగులకు మేలు చేయాలన్నారు. ప్రభుత్వంలో ఉద్యోగులు కీలక భూమిక పోషిస్తారని గుర్తుచేశారు. వారి కనీస కోర్కెలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. సమావేశంలో ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, పెదరత్తయ్య, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న చాంద్ బాషా

నేడు వైకుంఠపురం ఆలయం మూసివేత

తెనాలి: వైకుంఠపురంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేయనున్నట్టు సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి వి.అనుపమ శనివారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి, అమ్మవారలకు మహానివేదన, తదుపరి అవసర నివేదన సమర్పించిన అనంతరం ఆలయం మూసివేస్తామని తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణలు జరిపించి ఉదయం 10 గంటల నుంచి దర్శనం, పూజలు నిర్వహిస్తామని వివరించారు.



న్యూస్‌రీల్

పవర్ లిఫ్టర్ సాదియాకు ఘన స్వాగతం



విమానాశ్రయం(గన్నవరం): జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్‌కు శనివారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కోస్టారికా దేశం శాంజోస్‌లో జరిగిన పోటీల అనంతరం ఆమె హైదరాబాద్ మీదుగా మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సాదియా అల్మాస్‌కు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, అసోసియేషన్ బాధ్యులు గుమ్మడి వెంకటేశ్వరరావు, భాస్కరరావు, ఎండీ మస్తాన్‌వలి, ఎస్‌కే సుభాని, నరసరావుపేట ఎంఐఎం ఇన్‌చార్జ్ షేక్ మౌలాఅలీ, ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మాధల నాగుర్, పలు పాఠశాలల విద్యార్థులు స్వాగతం పలికారు. సాదియాతో పాటు ఆమె తండ్రి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి షేక్ సందానిని ఘనంగా సత్కరించారు.

నృసింహస్వామి ఆలయం నేడు మూసివేత



మంగళగిరి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు ఉపాలయాలు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూసి వేయనున్నట్లు ఆలయ ఈవో సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రహణ శుద్ధి అనంతరం సోమవారం ఉదయం 8 గంటల నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. భక్తులంతా గమనించి సహకరించాలని కోరారు.

బాలల చట్టాలపై అవగాహన సదస్సు



గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల చట్టాల అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లలకు దేశభక్తి నేర్పితే వారు చాలా వరకు మంచిగా మారతారని పోలీసులకు సూచించారు. డీసీపీఓ సీహెచ్ విజయ్ కుమార్, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. సుకుమార్ , సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ యు.చెన్నయ్య, పల్నాడు జిల్లా డీసీఆర్‌బీ వెంకట రమణ, నాలుగవ అదనపు జడ్జి ఎం.శోభారాణి, ఐదవ అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ ప్రసంగిస్తూ పలు అంశాలను వివరించారు. పిల్లలకి చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ ఇష్రాత్ ఫాతిమా మాట్లాడుతూ పిల్లలు దేశ సంపద అని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు.చెన్నయ్య, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠుడికి జలాభిషేకం



దాచేపల్లి: నీలకంఠేశ్వర స్వామిని తాకుతూ కృష్ణానది ప్రవహిస్తోంది. దాచేపల్లి మండలం కాట్రపాడు వద్ద కృష్ణానది ఒడ్డున నీలకంఠేశ్వరస్వామి విగ్రహాన్ని గత కృష్ణా పుష్కరాల సందర్భంగా డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ విక్రాంత్ కుటుంబ సభ్యులు ప్రతిష్టించారు. శనివారం నదిలో వరద పెరిగి నీలకంఠేశ్వర విగ్రహాన్ని తాకుతూ నీరు ప్రవహిస్తోంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,800** గరిష్ఠం : రూ. **2,600**

మోడల్ ధర రూ. **2,200**

క్లుప్తంగా

9న జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

మేడికొండూరు: గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహించను న్నారు. ఈ నెల 9వ తేదీన మేడికొండూరు మండలం కొరప్రాడులోని క్రీడా ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయి. ప్రతిభ చూపిన వారు ఈ నెల 13, 14వ తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిలో జరగ నున్న రాష్ట్రస్థాయి జూనియర్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించను న్నారు. హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా 2006 ఏప్రిల్ 01 తర్వాత పుట్టిన వారై ఉండాల న్నారు. ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని గుంటూరు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి అనిల్ తెలిపారు.

గంజాయి స్వాధీనం



మంగళగిరి టౌన్: గంజాయి కలిగిన ఓ వ్యక్తిని శుక్రవారం అర్ధరాత్రి మంగళగిరి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం... మంగళగిరి పట్టణానికి చెందిన వీరాంజనేయులు శుక్రవారం రాత్రి గంజాయి కలిగి ఉన్నాడనే సమాచారం పోలీసులకు అందింది. పట్టణ ఎస్ఐ హరిబాబు తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వీరాంజనేయులు పక్కనే ఉన్న మరో ఇద్దరు యువకులు పరారయ్యారు. ఇంట్లో సోదా చేయగా సుమారు 1.25 కేజీల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు విచారిస్తున్నారు. ఈ గంజాయి ఒడిశా నుంచి వస్తున్నట్లు ప్రాథమికంగా పోలీసులు తెలుసుకున్నారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా.. ఏ‘దయా’?

- ఆధార్‌కు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ
- ఎక్కువ ఎకరాల్లో సాగు చేసే రైతులకు తప్పని కష్టాలు
- అన్నదాతలదే తప్పు అంటూ టీడీపీ నేతల దుష్ప్రచారం
- అధికారులు, ప్రజాప్రతినిధులను ఆగ్రహంతో నిలదీసిన రైతులు



మార్కెట్ యార్డులో ఆందోళన చేస్తున్న రైతులు



మూసి ఉన్న ప్రధాని కిసాన్ సమృద్ధి కేంద్రం

మంగళగిరి: యూరియా కొరతపై రైతులు కన్నెర్ర చేశారు. శనివారం యూరియా కోసం పట్టణంలోని మార్కెట్ యార్డుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు చేరుకున్నారు. 11 గంటలు కావస్తున్నా యూరియా పంపిణీ చేసే కిసాన్ సమృద్ధి కేంద్రం మూసి ఉండటంపై ఆగ్రహించారు. ఆందోళనకు దిగడంతో సమాచారం అందుకున్న అధికారులు వచ్చి నచ్చచెప్పేందుకు యత్నించారు. రైతులు వినకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రేపు రండి అంటూ తమను తిప్పుతున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని రోజులు తిరగాలని, పంటలు ఎలా సాగు చేయాలని అధికారులను నిలదీశారు.

రైతులపై పచ్చ నేతల పైత్యం

మార్కెట్ యార్డు చైర్మన్, టీడీపీ నాయకులు రైతులను ఎగతాళి చేసేలా వ్యవహరించారు. మంత్రి లోకేష్ నియోజకవర్గంలో యూరియా, ఎరువుల కొరత లేదని, ఆధార్ కార్డు ఉన్న ప్రతి రైతుకు రెండు బస్తాలు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కావాలనే కొందరు రైతులు ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించారు. ఇది గమనించిన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మూడు రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా ఒక్క బస్తా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆధార్ కార్డుకు రెండు బస్తాలు ఇస్తే రైతు ఐదు ఎకరాలు సాగు చేస్తే రెండు బస్తాలు ఎలా సరిపోతుందని నిలదీశారు. మార్కెట్ యార్డు చైర్మన్ వచ్చి రైతులదే తప్పు అన్నట్లుగా మాట్లాడటంతో వారు మండిపడ్డారు. సమాధానం చెప్పలేక అక్కడి నుంచి చైర్మన్ జారుకున్నారు. అధికారులు రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏఓ శైలజారాణి మాట్లాడుతూ ప్రతి రైతుకు ఆధార్ కార్డు ఆధారంగా రెండు బస్తాల యూరియా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్ జగన్‌పై కూటమి కక్ష సాధింపు చర్యలు

- మద్యం అక్రమ కేసులో ముగ్గురు విడుదల హర్షణీయం
- వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): సుమారు 120 రోజుల నిర్బంధం, జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, గ్రూప్–1 అధికారి కృష్ణమోహన్‌రెడ్డి, ప్రముఖ సీఏ గోవిందప్పలకు విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దుర్మార్గమైన కేసు ఇదని అన్నారు. లిక్కర్‌లో అసలు స్కాం చేసే అవకాశం లేకపోయినా కావాలని క్రియేట్ చేశారని ఆరోపించారు. సిట్ అధికారులు రాజకీయ కక్ష తీర్చేందుకు పనిచేస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో చాలా విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. వైఎస్ జగన్‌పై కక్ష సాధింపు చర్యలు చేపట్టాలనే దురుద్దేశపూర్వకంగా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు. వేధింపులకు గురిచేసిన టీడీపీ ప్రభుత్వం.. తర్వాత బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో చంద్రబాబు అసెంబ్లీకి రాకుండా బావురుమంటూ రోదించి వెళ్లలేదా అని గుర్తు చేశారు. అప్పుడు కుప్పంలో ఎన్నికలు జరిగాయా అని అంబటి ప్రశ్నించారు. అదీగాక ఎన్టీఆర్ కూడా శాసనసభకు కొన్నాళ్లు రాలేదని, అప్పుడు జరగని ఎన్నికలు ఇప్పుడు జరుగుతాయా? అని అడిగారు. అప్పుడు తాను ఎమ్మెల్యేగా ఉన్నట్లు అంబటి గుర్తుచేశారు.

రైతులకు మేలు చేసేలా జీఎస్టీలో మార్పుల్లేవు

నగరంపాలెం: రైతులకు మేలు చేసేలా జీఎస్టీలో మార్పుల్లేవని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. జిన్నాటవర్ కూడలిలోని ఐసీసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ యువత, కార్మికులకు కూడా జీఎస్టీలో శ్లాబుల మార్పు ఉపయోగపడేలా లేదన్నారు. పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ తగ్గించాలని అన్నారు. ఆటోలు, ఫెర్టిలైజర్‌పై కూడా ఇదే నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు సంబంధించి కాస్మోటిక్స్, దుస్తులు, నగలపై పన్నులు విధించరాదని పేర్కొన్నారు. కొన్ని చోట్ల రివర్స్ ట్యాక్స్‌లు విధిస్తున్నారని, అది సరైంది కాదని చెప్పారు. ఒకట్రెండు రోజులుగా కిరాణా వస్తువుల దుకాణాల ఎదుట స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలనే బోర్డులు ఏర్పాటు మంచిదని అన్నారు. మిగతా వ్యాపారస్తులు కూడా ప్రయత్నించాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఆతుకూరి ఆంజనేయులు

వైఎస్సార్ సీపీ పదవుల నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని నియోజకవర్గాలకు పలువురు రాష్ట్ర కార్యదర్శులను పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ.. సంబంధిత రీజనల్ కోఆర్డినేటర్‌లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకులుగా వ్యవహరించేందుకు పలువురు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరుకు చెందిన నిమ్మకాయల రాజనారాయణను గుంటూరు ఈస్ట్, వెస్ట్, షేక్ గులాం రసూల్‌ను తెనాలి, ప్రత్తిపాడుకు, బాపట్ల జిల్లాకు చెందిన మదన్‌మోహన్‌గౌడ్‌ను తాడికొండ, మంగళగిరికి, గుంటూరుకు చెందిన బుర్రముక్కల వేణుగోపాలరెడ్డిని పొన్నూరు నియోజకవర్గానికి నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

లా పీజీ కోర్సులో తొమ్మిది బంగారు పతకాలు



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నుంచి పతకం స్వీకరిస్తున్న శ్రీరామ్

తెనాలి: పట్టణానికి చెందిన భాగవతుల నాగసాయి శ్రీరామ్ మాస్టర్ ఆఫ్ లా (ఎల్ఎల్ఎం)లో తొమ్మిది బంగారు పతకాలను సాధించారు. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంలో 11వ స్నాతకోత్సవంలో ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నుంచి వాటిని స్వీకరించారు. 2023–24లో ‘క్రిమినల్, సెక్యూరిటీ లా’లో నాగసాయి శ్రీరామ్ స్పెషలైజేషన్ చేశారు. బ్యాచ్‌లో టాపర్‌గా, పది సబ్జెక్టుల్లో ఎనిమిదింటిలో అత్యధిక మార్కులు సాధించినందుకు మొత్తం తొమ్మిది బంగారు పతకాలను అందుకోవటం విశేషం.

రొయ్యల లోడ్ పేరిట రూ.14 లక్షలు టోకరా

లక్ష్మీపురం: ఆరు టన్నుల రొయ్యల లోడ్ ఉందని చెప్పి ఓ వ్యక్తి వద్ద ముగ్గురు ఏజెంట్లు కలిసి రూ.14 లక్షల నగదు తీసుకుని మోసం చేసిన ఘటన పై అరండల్‌పేట పోలీసుల శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు వసంతరాయపురం రెండవ లైన్ ప్రాంతానికి చెందిన బీవీడీఏ ప్రసాద్, మరో వాటాదారుడితో కలిసి మైత్రి మెరైన్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ పేరుతో రొయ్యల వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీన ఏజెంట్లు నరేష్, శరత్, వరప్రసాద్‌లు ప్రసాద్‌కు ఫోన్ చేసి ఎన్టీఆర్ జిల్లా పెదపట్నం గ్రామంలో ఆరు టన్నుల రొయ్యలు ఉన్నాయని, రూ.14 లక్షలు నగదు, లారీని పంపించాల్సిందిగా చెప్పారు. వరప్రసాద్ అనే వ్యక్తికి సంస్థ ఖాతా నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.14 లక్షల నగదు పంపించారు. తర్వాత లారీ కూడా వెనక్కు రాలేదు. మోసం చేశారని గమనించి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నూటా కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు ఆచార్య బ్రహ్మాజీ



కార్యదర్శి ఆచార్య త్రిమూర్తిరావు

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (నూటా) నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఆచార్య పండు బ్రహ్మాజీ రావు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఉత్తర్వులను ఎలక్షన్ అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్ శనివారం విడుదల చేశారు. పర్యావరణ విభాగానికి చెందిన ఆచార్య పండు బ్రహ్మాజీరావు అధ్యక్షుడిగా, సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగానికి చెందిన ఆచార్య ఎం.త్రిమూర్తి రావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఆచార్య ఎం.సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా ఆచార్య డి.రామచంద్రన్, కోశాధికారిగా ఫిజిక్స్ విభాగానికి చెందిన ఆచార్య చేబ్రోలు లింగరాజు ఎన్నికయ్యారు. సైన్స్ రిప్రజెంటేటివ్‌గా టెక్నాలజీ విభాగానికి చెందిన డాక్టర్ బి.సుధాకర్, కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ కె.లావణ్య, ఆర్ట్స్ రిప్రజెంటేటివ్‌గా సోషియాలజీ విభాగానికి చెందిన ఆచార్య వై.అశోక్ కుమార్, మానవ వనరుల విభాగానికి చెందిన ఆచార్య వి.తులసీదాస్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు అభినందించారు.

జిల్లాలో 21,800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

డీఏఓ అయితా నాగేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 21,800 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ పంట కాలంలో వరి, పత్తి 77,340 హెక్టార్లలో సాగు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రైతుల అవసరానికి మించి యూరియా సరఫరా చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 1,278 మెట్రిక్ టన్నులు చిల్లర వర్తకుల వద్ద, 1,448 మెట్రిక్ టన్నులు టోకు వర్తకుల వద్ద అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో 1,850 మెట్రిక్ టన్నుల వరకు జిల్లాకు రానుందని తెలిపారు. ఫిర్యాదుల కోసం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానిటరింగ్‌కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలి

గుంటూరు వెస్ట్: రైతులతోపాటు ఇతర రుణాలు ఇచ్చే క్రమంలో బ్యాంకర్లు కొంత ఉదారతతో వ్యవహరించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్‌లతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు అందుకున్న రైతులకు బ్యాంకర్లు రుణాలు తప్పనిసరిగా మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం రుణాల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్నం మహిపాల్ రెడ్డి, ఇండియన్ బ్యాంక్ డీజీఎం గౌరీ శంకర్, ఆర్బీ ఎల్డీఓ గిరిధర్, నాబార్డ్ డీడీఎం శరత్ బాబు పాల్గొన్నారు.

తురకపాలెం మరణాలు ప్రభుత్వ హత్యలే



విలేకరుల సమావేశంలో ఆంధ్ర మాల్యాద్రి, సంఘ సభ్యులు

లక్ష్మీపురం: ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ప్రజల మరణాలు ప్రభుత్వ హత్యలేనని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి ఆరోపించారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితులు ఎక్కువగా వారి కుటుంబ పోషకులను కోల్పోయారని తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందనే విషయానికి ఈ ఘటన తార్కాణం అన్నారు. మృతుల కుటుంబంకు రూ.25 లక్షలు పరిహారంగా చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు లూదర్ పాల్, జె.వెంకటస్వామి, సీఐటీయూ గుంటూరు నగర కార్యదర్శి ముత్యాలరావు, షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

తురకపాలెం బాధితులకు రూ.10 లక్షలివ్వాలి

గుంటూరు రూరల్: తురకపాలెంలో ప్రభుత్వ వైఫల్యాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు 40 మందికిపైగా మరణించారని, బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం అందించాలని జనచైతన్య వేదిక, రేట్ పేయర్స్ అసోసియేషన్, అవగాహన, మానవత, నేస్తం, కొవిడ్ ఫైటర్స్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మాదిగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ తదితర పౌర సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పౌర సంస్థల ప్రతినిధులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ శనివారం తురకపాలెం మృతుల కుటుంబాలను పరామర్శించింది.

అదుపులోకి పరిస్థితులు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో పరిస్థితులు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయని, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిరంతరం వైద్య ఆరోగ్య ఇతర సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ట్యాంకర్స్ ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతోందన్నారు.

అనవసరమైన ఆందోళనలకు గురి కావద్దని తెలిపారు. గ్రామంలో సంభవించిన మరణాలకు గల కారణాలపై జాతీయ, రాష్ట్ర స్థాయిలోని వైద్య బృందాలతో విశ్లేషించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు .

ఉపాధ్యాయుల చేతుల్లో దేశ భవిష్యత్తు

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు విలువలు కూడా ఉపాధ్యాయులు నేర్పించాలని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఎంత లోతుగా పరిజ్ఞానాన్ని రాబోయే తరంతో పంచుకుంటున్నామో ఆలోచించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఈవో మేఘన కూరపాటి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డి.విజయరాము, డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.